గుంతల రోడ్లతో తిప్పలు

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- మరమ్మతులు చేపట్టాలని వేడుకోలు


గుంతలతో అధ్వానంగా మారిన బీటీ రోడ్డు

తిర్యాణి: మండలంలోని రోడ్లు గుంతలతో అధ్వానంగా మారాయి. ఈ రోడ్లపై ప్రయాణించడానికి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రిపూట గుంతల రోడ్లపై రాకపోకలు సాగించాలంటేనే జంకుతున్నారు. మండలంలోని చిన్న అరటిపెల్లి స్టేజి నుంచి మంచిర్యాల జిల్లా తాండూర్ మండలం త్రీ- ఇన్‌క్లెయిన్ వైపునకు వెళ్లే దారి గుంతలమయంగా మారింది. ఈ మార్గంలో వెళ్లాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వెళ్లాల్సి వస్తుందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు నిర్మాణ పనులు చేపట్టి ఏళ్లు గడుస్తున్నా నేటికీ సరైన మరమ్మతులు చేపట్టకపోవడంతో రోడ్డంతా అధ్వానంగా మారింది. గుంతలు ఎక్కడ ఉన్నాయో తెలియక రాత్రి వేళల్లో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు.

అడుగడుగునా గుంతలు..

మండలంలోని మొర్రిగూడ స్టేజి నుంచి మొదలుకొని అరటిపెల్లి స్టేజి వరకు రోడ్డుపై అడుగడుగున పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. మండల కేంద్రం నుంచి వందలాది మంది ప్రజలు నిత్యం ఉద్యోగాలు, నిత్యావసర సరుకుల కొనుగోలు కోసం మంచిర్యాల జిల్లాకు వెళ్తుంటారు. రహదారి ప్రయాణికులకు అనుకూలంగా లేకపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. గుంతల రోడ్లపై నిత్యం ప్రయాణాలు సాగించడం ద్వారా వెన్ను పూస, నడుం నొప్పి వంటి సమస్యలు తలెత్తున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని మండలవాసులు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి



చిన్న అరటిపెల్లి స్టేజి నుంచి మొర్రిగూడ స్టేజి వరకు రోడ్డుపై విపరీతంగా గుంతలు ఉన్నాయి. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. అధికారులు వెంటనే స్పందించాలి. లేదంటే సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతాం.

– తొడసం భాస్కర్, తుడుందెబ్బ మండల అధ్యక్షుడు

మరమ్మతులు చేపట్టాలి



రోడ్డుపై అధిక సంఖ్యలో గుంతలు ఉండటంతో రాత్రివేళ ద్విచక్రవాహనాలపై ప్రయాణించాలంటే భయంగా ఉంది. రోడ్డుకు ఎలాంటి మరమ్మతు పనులు చేపట్టకపోవడంతో ప్రయాణికులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలి.

– సార రమేశ్‌గౌడ్, రాళ్లకన్నెపల్లి

నిరుపయోగంగా జనరేటర్లు

- తహసీల్దార్ కార్యాలయాల్లో వినియోగించని వైనం
- ప్రజాసేవలకు అంతరాయం


దహెగాం తహసీల్దార్ కార్యాలయంలో నిరుపయోగంగా జనరేటర్

దహెగాం: విద్యుత్ కోతల సమయంలో పనులకు ఆటంకం కలగకుండా రాష్ట్ర ప్రభుత్వం కొన్నేళ్ల కిందట తహసీల్దార్ కార్యాలయాలకు జనరేటర్లు పంపిణీ చేసింది. జనరేటర్లు పంపిణీ చేసినా వినియోగించకపోవడంతో ఏళ్లుగా అవి నిరుపయోగంగా మారాయి. అధికార యంత్రాంగం సైతం వీటి గురించి పట్టించుకోవడం లేదు. కొన్ని చోట్ల జనరేటర్లు తుప్పు పట్టాయి. దీంతో ప్రభుత్వ ఆశయం నీరుగారిపోవడంతో పాటు లక్షల రూపాయల ప్రజా ధనం వృధా అవుతోందని పలువురు వాపోతున్నారు.

పనులకు ఆటంకం కలగకుండా..

ప్రభుత్వ కార్యాలయాల్లో పనులకు ఆటంకం కలగకుండా 16 ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం మండలాల్లోని తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలకు జనరేటర్లను మంజూరు చేసింది. పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ జనరేటర్లను కార్యాలయాల్లో బిగించారు. కానీ ఒక్క రోజు కూడా వాటిని వినియోగించలేదు. జనరేటర్లు మూలన పడడంతో కార్యాలయాల్లో పనులకు ఆటంకం కలుగుతోంది. వివిధ అవసరాల నిమిత్తం ప్రజలు కార్యాలయాలకు వస్తే పనులు ముందుకు సాగడం లేదు. ప్రభుత్వం లక్షల రూపాయలు వెచ్చించిన జనరేటర్లు మూలన పడ్డాయని దీంతో ప్రజాధనం వృధా అయిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అంతటా నిరుపయోగమే..

విద్యుత్ కోతల సమయంలో ప్రభుత్వ కార్యాలయాల్లో పనులకు ఆటంకం కలగకుండా ఉండడానికి అప్పటి ప్రభుత్వం జనరేటర్లను ఏర్పాటు చేయగా అవి ప్రస్తుతం నిరుపయోగంగా మారాయి. దహెగాం, బెజ్జూర్, కౌటాల తదితర మండలాల్లోని ప్రభుత్వ కార్యాలయాల్లో నిరుపయోగంగా ఉన్నాయి. కార్యాలయం ఆరుబయట వాటిని ఏర్పాటు చేయడంతో వానకు తడుస్తూ, ఎండకు ఎండుతూ జనరేటర్లు చెడి పోతున్నాయి. ఏర్పాటు చేసిన చోటే తుప్పు పడుతున్నాయి. విద్యుత్ కోతలు విధించిన సమయంలో కార్యాలయాల్లో ఉన్న ఇన్వర్టర్ల సహాయంతో పనులు చేపడుతున్నారు. వాటిల్లో ఏదైనా సాంకేతిక లోపం తలెత్తితే పనులు కొనసాగించడం లేదు తప్పా జనరేటర్లు వినియోగించడం లేదు. దీంతో సిబ్బంది సైతం ఇబ్బందులకు గురవుతున్నారు. తహసీల్దార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్‌లు కొనసాగుతున్నందున విద్యుత్ లేని సమయంలో ఇన్వర్టర్ల సహాయంతో రిజిస్ట్రేషన్‌లు చేపడుతున్నారు. బ్యాటరీలలో చార్జింగ్ లేని సమయంలో పనులకు ఆటంకం కలుగుతుందని సిబ్బంది వాపోతున్నారు. సేవలకు అంతరాయం ఏర్పడుతున్నందున నిరుపయోగంగా మారిన జనరేటర్లను వినియోగంలోకి తీసుకురావాలని ప్రభుత్వ కార్యాలయాల సిబ్బంది, ప్రజలు కోరుతున్నారు.

ఇన్వర్టర్ల సహాయంతో..



విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే సేవలకు అంతరాయం కలగకుండా ప్రస్తుతం కార్యాలయంలో ఇన్వర్టర్ల సహాయంతో పనులు చేపడుతున్నాం. కార్యాలయానికి వివిధ అవసరాల నిమిత్తం వచ్చిన ప్రజలకు ఆటంకం కలగకుండా చూస్తున్నాం. అప్రకటిత విద్యుత్ కోతలు ఉంటే ఏమి చేయలేం. నిరుపయోగంగా మారిన జనరేటర్లను వినియోగంలోకి తీసుకొస్తాం.

– కవిత, తహసీల్దార్, దహెగాం

క్లుప్తంగా

క్రికెట్ పోటీలు ప్రారంభం


పోటీలు ప్రారంభిస్తున్న నాయకులు

దహెగాం: మండల కేంద్రంలో భీమనాధుల జగదీశ్ స్మారకార్థం దహెగాం యూత్ ఆధ్వర్యంలో సోమవారం క్రికెట్ పోటీలు ప్రారంభించారు. ప్రథమ బహుమతి రూ. 21,000, ద్వితీయ బహుమతి రూ. 11,000 నగదు అందజేస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు.

పెళ్లికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

లింగాపూర్: మండల కేంద్రంలోని పేద కుటుంబానికి చెందిన జాదవ్ బులిబాయి –విజేష్ దంపతుల కుమార్తె జాదవ్ మహేశ్వరి వివాహానికి సోమవారం అభినవ్ సర్దార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.10,000ల ఆర్థిక సాయం చేశారు. ఫౌండేషన్ సభ్యులు జాదవ్ అశోక్, ఆడే అశ్విన్, జాటోత్ దవీత్ కుమార్ చేతుల మీదుగా ఆర్థిక సాయం అందజేశారు. వేలువాక శ్రీకాంత్, వికాస్, ఆమోల్, భరత్, యువకులు తదితరులు ఉన్నారు.

భూమిపూజ


భూమిపూజ చేస్తున్న గ్రామస్తులు

చింతలమానెపల్లి: మండలంలోని అంబగట్ట గ్రామంలో సోమవారం శివాజీ విగ్రహ నిర్మాణ పనులు ప్రారంభించారు. శాస్త్రోక్తంగా భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ చాప్లె రోజ, నాయకులు చాప్లె సుధాకర్, భీంకరి భీమయ్య, దుబ్బుల సంతోష్, ఒడిల మైసయ్య, ఎల్ములె రాజన్న, ఆకిరెడ్డి రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

చింతలమానెపల్లి: మండలంలోని గంగాపూర్ గ్రామంలో సిమెంటు రహదారి పనులను సోమవారం కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం కింద మంజూరైన రూ. 5లక్షల నిధులతో పనులు నిర్వహించనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కోరం కనకయ్య, ఉపాధ్యక్షుడు జునుగరి శేఖర్, నాయకులు కొండు శంకర్, లోడెల్లి ప్రవీణ్, చాప్లె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'బీటీరోడ్డు పనులు కొనసాగించాలి'

రెబ్బెన: మండలంలోని రాంపూర్‌లో చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణ పనులను తిరిగి కొనసాగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు చాపిడి పురుషోత్తం డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ రాంపూర్ గ్రామానికి ఎన్నో ఏళ్లుగా మెరుగైన రోడ్డు సౌకర్యం లేకపోవటంతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురయ్యారన్నారు. గత ప్రభుత్వం రోడ్డు నిర్మాణానికి నిధులను విడుదల చేయగా కాంట్రాక్టర్ పనులు ప్రారంభించాడన్నారు. నిర్మాణ పనులను ప్రజా ప్రతినిధులు అడ్డుకోవడంతో పనులు నిలిచిపోయాయని పేర్కొన్నారు. అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని నిలిచిపోయిన పనులు తిరిగి ప్రారంభయ్యేలా చూడాలన్నారు. మండల సహాయ కార్యదర్శి చాపిడి శివ, మండల ఉపాధ్యక్షుడు చల్లూరి కృష్ణ పాల్గొన్నారు.

సీసీ రోడ్లకు శంకుస్థాపన

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ మండలం అందవెల్లి, బోడపల్లి గ్రామాల్లో సోమవారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ సీసీరోడ్లకు శంకుస్థాపన చేశారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.56 లక్షలతో పలు రోడ్ల నిర్మాణాలు ప్రారంభించారు. ఎంపీటీసీ శ్యాంరావు, వార్ల తిరుపతి, నాయకులు కోట శంకర్, డోకె రవి, నాగేంద్ర, ప్రశాంత్, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

ఓటింగ్‌పై అవగాహన


ఈవీఎం ద్వారా ఓటు వేస్తున్న మహిళలు

ఆసిఫాబాద్: పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం ఈవీఎం ఓటింగ్‌పై ఎన్నికల సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. ఎన్నికల్లో ఓటు వేయడంలో పొరపాట్లు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కలెక్టరేట్‌కు వచ్చిన ప్రజల వివరాలు రిజిస్టర్‌లో నమోదు చేసుకొని ఈవీఎం ద్వారా ప్రాక్టికల్‌గా ఓటు వేయించారు.

శివరాత్రి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని సందీప్‌నగర్ శివాలయంలో మార్చి 8వ తేదీన నిర్వహించే శివరాత్రి ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లను సోమవారం ఎమ్మెల్యే కోవ లక్ష్మి తన నివాసంలో మేరు సంఘం ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని కోరారు. శివరాత్రి రోజు నిర్వహించే పూజా కార్యక్రమానికి హాజరుకావాలని సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యేని ఆహ్వానించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు రామగిరి, నరసింహస్వామి, అక్కు విజయ్‌కుమార్, అశోక్, శంకర్, సత్యనారాయణ, సభ్యులు పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

జైనూర్: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం 47 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే కోవ లక్ష్మి కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం మండల కేంద్రంలోని వంజరి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నివాసంలో నిర్వహించిన నూతన వధూవరుల నిశ్చితార్థం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కనక యాదవరావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఇంతియాజ్‌లాలా, వైస్ ఎంపీపీ చిర్లే లక్ష్మణ్, మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షుడు మడావి భీంరావు, బీఆర్‌ఎస్ నాయకులు జన్నావార్ పవన్, గేడం లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మికత అలవర్చుకోవాలి


జ్ఞాపిక అందజేస్తున్న ప్రవీణ్‌నాయక్

జైనూర్: ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక మార్గాన్ని అలవర్చుకోవాలని సంత్ తపస్వీ రామారావు సేవాభాయ, దివ్యశ్రీ ఫౌండేషన్ చైర్మన్ ధారావత్ ప్రవీణ్ నాయక్ అన్నారు. సోమవారం మండలంలోని కిషన్‌నాయక్ తండాలో సంత్ సేవాలాల్, జగదాంబ దేవి ఆలయాల్లో కలశరోహణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులు తెల్లవారు జామున ప్రత్యేక పూజలు, హోమం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో దివ్యశ్రీ ఫౌండేషన్ వైస్‌చైర్మన్ ఆత్రం భీంరావు, తదితరులు ఉన్నారు.

కబడ్డీ పోటీలను విజయవంతం చేయండి


ప్రశంసాపత్రాలు అందుకుంటున్న క్రీడాకారులు

వాంకిడి: మండల కేంద్రంలో మార్చి 8, 9 తేదీల్లో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గేడం టీకానంద్, గొడిసెల కార్తిక్ తెలిపారు. సోమవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. భగత్‌సింగ్ 93వ వర్ధంతి పురస్కరించుకొని పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 7702664187, 6302363282 నంబర్లలో సంప్రదించాలన్నారు.

సుర్దాపూర్‌లో క్రీడలు

కెరమెరి: నెహ్రూ యువ కేంద్ర, చౌపన్‌గూడకు చెందిన శ్రీ చైతన్య యువజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం సుర్దాపూర్ గ్రామంలో కబడ్డీ, వాలీబాల్ ఆటల పోటీలు నిర్వహించారు. క్రీడల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు ప్రశంసాపత్రాలు అందించారు. చౌపన్‌గూడ, సుర్దాపూర్ గ్రామాలకు చెందిన క్రీడాకారులకు వాలీబాల్ కిట్లు అందించారు. కార్యక్రమంలో నెహ్రూయువ కేంద్ర జిల్లా కోఆర్డినేటర్ మజీద్, చైతన్య యువజన సంఘం నాయకులు వసంత్‌రావు, జగన్, తుకారాం, సాగర్, దేవేందర్ తదితరులు ఉన్నారు.

29 నుంచి ధ్యాన కేంద్ర వార్షికోత్సవాలు

వాంకిడి: మండలంలోని ఖిరిడి గ్రామంలో ఈ నెల 29, మార్చి 1న సద్గురు పూలాజీ బాబా ధ్యాన కేంద్రం 10వ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు. 29న రాత్రి గ్రంధ పూజ, ధ్యాన ధారణ, వివిధ గ్రామాల బృందాలతో భజన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. మార్చి 1న నిర్వహించే ఆధ్యాత్మిక జ్ఞాన తత్సంగ ప్రవచరము కార్యక్రమానికి ముఖ్య సంస్థాన్ పాట్నపూర్ అధ్యక్షుడు, బాబా కుమారుడు కేశవ్‌రావు, గౌరవ అధ్యక్షుడు వామన్‌రావు పాల్గొని పూలాజీ బాబా అమృతవాణి, ప్రవచనలు వినిపించనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని బాబా భక్తులు తరలిరావాలని ధ్యాన కేంద్రం కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు.

జిల్లా ట్రెజరీ అధికారిని కలిసిన సీనియర్ సిటిజన్స్


రాజేశ్వర్‌కు డైరీ అందజేస్తున్న సత్యనారాయణ

ఆసిఫాబాద్: జిల్లా ట్రెజరీ అధికారి రాజేశ్వర్‌ను సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డైరీ, పిలుపు మాస పత్రికలను అందజేశారు. అనంతరం కలెక్టర్ హేమంత్ బోర్కడేను కలిసి సీనియర్ సిటిజన్ల కార్యాలయం, వృద్ధాశ్రమానికి స్థలం కేటాయించి, భవనం నిర్మించాలని వినతిపత్రం సమర్పించినట్లు ఆయన తెలిపారు.

'శ్రీనివాస్‌రెడ్డి నియామకం హర్షనీయం'

ఆసిఫాబాద్‌అర్బన్: తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్‌గా ఐజేయూ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి నియామకం హర్షనీయమని టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రెహమాన్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని టీయూడబ్ల్యూజే(ఐజేయూ) కార్యాలయంలో యూనియన్ నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

నేడు పరీక్ష సామగ్రి పంపిణీ

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో మంగళవారం పోలీసుల ఆధ్వర్యంలో మండలంలోని పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేస్తున్నట్లు ఎస్సై దీకొండ రమేశ్ తెలిపారు. జిల్లా ఎస్పీ సురేశ్‌కుమార్ హాజరై విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేస్తారన్నారు.

సంక్షిప్త వార్తలు

జాబ్‌మేళాకు స్పందన

సిర్పూర్(టి): జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించిందని సిర్పూర్(టి) ఎస్సై దీకొండ రమేశ్ తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 150 మంది యువత పాల్గొని సద్వినియోగం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

చేవెళ్ల తరలిన మహిళా సంఘాల సభ్యులు

ఆసిఫాబాద్: మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులతో మంగళవారం చేవెళ్లలో నిర్వహించనున్న ఆత్మీయ సమావేశానికి జిల్లా మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు సోమవారం రాత్రి తరలివెళ్లారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. జిల్లాకు చెందిన 400 మంది మహిళలు 10 ప్రత్యేక బస్సుల్లో తరలివెళ్లారు.

'అవకాశం ఇస్తే అభివృద్ధి చేస్తా'

ఆసిఫాబాద్‌అర్బన్: పార్లమెంట్ ఎన్నికల్లో ఆదిలాబాద్ ఎంపీగా అవకాశం ఇస్తే అభివృద్ధి చేస్తానని సినీ నటుడు అభినవ సర్దార్ ఖిలావత్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రేమలా గార్డెన్ ఆవరణలో నిర్వహించిన సేవాలాల్ జయంతి వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో బీజేపీ అధిష్టానం తనకు టికెట్ ఇస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నాయకులు ఆత్మారాంనాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

వాంకిడి: విద్యారంగంలో అత్యధిక కోర్సులు చేసి ప్రపంచ రికార్డు సాధించిన మండలంలోని సరాండి పాఠశాల ఉపాధ్యాయుడు నూతి అభిలాష్‌ను ఎస్‌జీటీయూ సంఘం నాయకులు సోమవారం శాలువాతో సన్మానించారు. ఎస్‌జీటీయూ జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి శ్రావణ్, ప్రధాన కార్యదర్శి వైరగడె వినోద్, జిల్లా గౌరవ అధ్యక్షుడు చర్లపల్లి నాగరాజు, ఉపాధ్యక్షుడు బండి శేఖర్, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం


వాటర్ ప్లాంట్ ప్రారంభిస్తున్న ఫాదర్ సిబి


బెజ్జూర్: మండలంలోని ఎలుకపల్లి(బి)లో సోమవారం మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభించారు. క్లారిటీన్ సంస్థ చర్చి ఫాదర్ సిబి మాట్లాడుతూ ప్రజలకు శుద్ధ జలం అందించాలనే ఉద్దేశంతో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పర్వీన్ సుల్తాన, ఫాదర్లు విపిన్, జోజి, నాయకులు జావిద్ అలీ, కొట్రంగి భీమన్న, వెంకటి, అబ్బాస్, నిర్వాహకులు శంకర్ తదితరులు పాల్గొన్నారు.


ఘనంగా ఆంజనేయ స్వామి విగ్రహ వార్షికోత్సవం


హోమం చేస్తున్న అర్చకులు, భక్తులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని ఉత్తర వాహిణి పెద్దవాగు సమీపాన గల శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహ 13వ వార్షికోత్సవాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అర్చకులు శిరీష్‌శర్మ, నిమ్మకంటి మహేశ్‌శర్మ స్వామి వారికి గణపతి, గౌరీపూజ, స్వస్తి పుణ్యావచనం, నవగ్రహ పూజ, లఘున్యాస పూర్వక రుద్రాభిషేకం, మనుసూక్త హవనం, బలిహరణం, పూర్ణాహుతి, మంగళహారతి, మహా మంత్రపుష్పం నిర్వహించారు. స్వామివారికి డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, ఎంపీపీ మల్లిఖార్జున్, మాజీ ఎంపీపీ బాలేశ్వర్‌గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్‌లు చిలువేరు వెంకన్న, మల్లేశ్‌లు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం 11 గంటల నుంచి కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో నిర్వాహకులు ధర్మపూరి వెంకటేశ్వర్లు, గుండా వెంకన్న, రూప్‌నార్ రమేశ్, ఎకిరాల శ్రీనివాస్, పిన్నా వివేక్, గడ్డల వెంకన్న, నరసింహస్వామి, జీవన్, మధు, రాజశేఖర్, అశోక్, మధు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన కౌటాల ఎంపీపీ


కాంగ్రెస్‌లో చేరుతున్న ఎంపీపీ విశ్వనాథ్


కాంగ్రెస్‌లో చేరుతున్న అర్షద్ హుస్సేన్

కౌటాల: ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. సోమవారం హైదరాబాద్‌లో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ సమక్షంలో తన అనుచరులతో కలిసి ఆయన కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఆయనతో పాటు ప్రస్తుత కౌటాల కోఆప్షన్ సభ్యులు అజ్మత్ అలీ, మాజీ ఎంపీటీసీ బండు, మాజీ సర్పంచ్ రత్నం సోమయ్య, మాజీ ఉప సర్పంచులు పసునూరి తిరుపతి, పర్చాకే బండు, బీఆర్‌ఎస్ మండల యూత్ అధ్యక్షులు తాళ్లపల్లి రవీందర్‌గౌడ్, యాదవ సంఘం మండలాధ్యక్షుడు గట్టయ్య, మున్నెవార్ సంఘం జిల్లా నాయకులు డబ్బా బాపు, పలువురు బీఆర్‌ఎస్ మండల నాయకులు పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో ఎంపీపీ విశ్వనాథ్‌పై బీఆర్‌ఎస్ పార్టీ ఎంపీటీసీ సభ్యులు త్వరలో అవిశ్వాసం పెట్టనున్నట్లు తెలుస్తోంది.

కాంగ్రెస్ పార్టీలో చేరిన అర్షద్ హుస్సేన్

బెజ్జూర్: బెజ్జూర్ సింగిల్ విండో మాజీ చైర్మన్, బీఎస్పీ కార్యనిర్వాహక కమిటీ చైర్మన్ అర్షద్ హుస్సేన్ కాంగ్రెస్‌లో చేరారు. సోమవారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో దీపాదాస్ మున్షి ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

కాంగ్రెస్‌లో చేరిన మాజీ సర్పంచ్

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని గన్నారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ యాదగిరి నీలయ్య కాంగ్రెస్ పార్టీలో చేరారు. రావి శ్రీనివాస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వార్ల తిరుపతి పాల్గొన్నారు.

అలరించిన వీడ్కోలు పార్టీ


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కౌటాల: కౌటాల మయూరి విద్యాలయంలో సోమవారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ యాదగిరి మాట్లాడుతూ విద్యార్థి దశలో విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి.

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి

గ్రామీణ ప్రాంత విద్యార్థులు జీవితంలో ఉన్నతంగా ఎదగాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బిషప్ ప్రిన్స్ అంతోని అన్నారు. సోమవారం కౌటాల ఇన్‌ఫంట్ జీసస్ పాఠశాలలో ఘనంగా స్కూల్ డే వేడుకలు నిర్వహించారు. ఫాదర్లు థామస్ టామ్, బైజు, సతీష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.